క్లుప్తంగా

తోటపల్లి దేవస్థానం ఈఓగా సూర్యనారాయణ

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల కార్యనిర్వహణ అధికారిగా వీవీ సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతవరకు ఈఓగా బాధ్యతలను నిర్వహించిన నగేష్ విశాఖపట్నంలోని పలు దేవాయాలకు కార్యనిర్వాహణాధికారిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు తోటపల్లి దేవస్థానానికి నూతన ఈఓగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామంలో పని చేస్తున్న వీవీ సూర్యనారాయణను నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సూర్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని బీఎస్ఆర్ కళింగ వైశ్య కళ్యాణ మండపం వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుకు దీనమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

భామిని: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సీతారాం సూచించారు. వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి, ఏఓ రేగిడి మన్మథరావుతో కలిసి మండలంలోని ఘనసర, సతివాడ, తాలాడ తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న వరి, పత్తి, తదితర పంటలను శుక్రవారం పరిశీలించారు. నీటి ఎద్దడిని అధిగమించి సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొట్టదశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు మల్టీ-కె (పోటాషియం నైట్రేట్) మందును నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటకు రక్షణగా మెగ్నీషియం సల్ఫేట్ 20 గ్రాములు, యూరియా 10 గ్రాముల చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఎన్‌ఎంయూ నాయకుల రిలేదీక్ష

పాలకొండ రూరల్: ఆర్టీసీలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) నాయకులు శుక్రవారం పాలకొండ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రిలేదీక్షలు చేపట్టారు. ఆ సంఘ డిపో అధ్యక్షులు ఎల్.ఆర్.రావు, రీజనల్ ఉపాధ్యక్షులు పి.ఎల్.రావు, కార్యదర్శి వి.రాజేష్ తదితరులు మాట్లాడుతూ డిపోల్లో అదనపు, సస్పెండ్ అయిన ఉద్యోగులకు అదే డిపోల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని, ఓఆర్ తక్కువ వస్తుందన్న పేరిట ఒక డిపోలో వాహనంతో పాటు సిబ్బందిని మరో డిపోకు బదిలీ చేయు విధానానికి స్వస్తి పలకాలని కోరారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి డిపోల యాజమాన్యాలు చొరవ చూపాలని, ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లాలని నినాదాలు చేశారు. ఈ దీక్షలో మజ్జి సుబ్బారావు, కేఈ.రావు తదితరులున్నారు.

సమన్వయంతో అభివృద్ధి

పాలకొండ రూరల్: వార్షిక ప్రణాళిక ప్రాప్తికి ఉపాధిహామీ పనులను గ్రామస్తుల సమన్వయంతో గుర్తించి, ప్రణాళికలు రూపొందించనున్నట్లు భాసూరు సర్పంచ్ ఎస్.గురునాయుడు పేర్కొన్నారు. ఉపాధి ఏపీఓ ఎం.ఈశ్వరమ్మ నేతృత్వంలో ఉపాధి వేతనదారుల, గ్రామస్తులతో కలిసి శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. వచ్చే ఏడాదిలో చేపట్టాల్సిన పనులు గుర్తించారు. రైతులు, గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే అన్నవరం గ్రామంలో సర్పంచ్ గవర రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.

కొమరం భీమ్ వర్ధంతి

సీతంపేట: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం కొమరం భీమ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమరం భీమ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మణరావు, డొంబు, ఆనందు, మాసయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

వంటపాత్రలు అందజేత

పాలకొండ: పట్టణంలోని వీవర్స్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలకు నూతన వంట పాత్రలు సమకూరినట్లు హెచ్ఎం పరాంకుశం నాయుడు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఊల్ల స్వాతి నేతృత్వంలో శుక్రవారం వంట పాత్రలను మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అందజేశారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వంట సిబ్బందికి సూచించారు.

సవర భాషా పుస్తకాల పంపిణీ

సీతంపేట: ఒకటో తరగతి విద్యార్థులకు డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో సవర భాషా పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. వీరఘట్టం, భామిని, సీతంపేట, పాలకొండ మండలాలకు చెందిన విద్యార్థులకు వీటిని పంపిణీ చేయాలని సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ పి.కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం


కొమరాడ: గిరిశిఖర గ్రామమైన పెదశాఖలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సేవలపై ఆరా తీస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ శిబిరాల్లో నిపుణులైన వైద్యులచే వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులను ఉచితంగా అందిస్తున్నారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. రోగులకు మందులు, హెల్త్ రిపోర్టులు అందజేశారు.

– సాక్షి పాలకొండ, కురుపాం


సీతంపేట: పులిపుట్టిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు


కురుపాం: కురుపాంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, తదితరులు


సీతంపేట: పులిపుట్టి ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు


వీరఘట్టం: వీరఘట్టంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ దమలపాటి, సర్పంచ్ గౌరమ్మ

చినమేరంగిలో 'నామట్టి-నాదేశం'

జియ్యమ్మవలస: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'నామట్టి-నాదేశం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి మట్టిని సేకరించి నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి పైడాన శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది

వేడుకగా శ్రీ చక్రస్నానం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం పరిధిలో పవిత్ర నాగావళి నదీ తీరంలో శుక్రవారం నిర్వహించిన శ్రీచక్ర స్నానం ఘనంగా నిర్వహించారు. స్వామివారి పవిత్రోత్సవాల భాగంగా సుప్రభాత సేవ, తిరువీధి తదితర కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట నాగావళి నదీ తీరం వరకు తిరువీధిని నిర్వహించి అభిషేకాలను నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి నిర్వహించిన పూజల్లో భక్తులు అధికంగా పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.


స్వామి వారికి శ్రీచక్రస్నానం

70 లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని కొంచ గ్రామ సమీపంలో సారా విక్రయిస్తున్న మండంగి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎంవీ రమణ శుక్రవారం తెలిపారు. అతని వద్ద 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

కొప్పెరడాం కొండ సమీపంలో..

సీతంపేట: అక్రమంగా సారా తరలిస్తున్న సవర బాపడు అనే వ్యక్తిని కొప్పెరడాం కొండ సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. అతని వద్ద 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

జీసీసీ పెట్రోల్ బంక్ పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: పెట్రోల్ బంక్‌కు వచ్చే వాహనదారులకు సత్వరమే సేవలందించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట జీసీసీ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, పెట్రోల్ బంక్ ఇన్‌ఛార్జ్ భాస్కరరావు ఉన్నారు.

జీసీసీ ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ తనిఖీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జీసీసీ ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్(గొడౌం)ను సివిల్‌సప్లై డీఎస్ఓ శివప్రసాద్, జీసీసీ డీఎం వి.మహేంద్ర కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొడౌంలో నిల్వ ఉన్న బియ్యం, కందిపప్పు నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, డిపోలకు సకాలంలో సరఫరా చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వారి వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడౌం ఇన్‌ఛార్జ్ ఎం.సాంబశివరావు తదితరులు ఉన్నారు.

అట్టలి రహదారిలో జంగిల్ క్లియరెన్స్

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో రహదారి మలుపు వద్ద తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై సాక్షిలో ప్రచురితమైన కథనంపై పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు స్పందించారు. ఈ మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెట్లును తొలగించాలని ఎస్సై బి.శివప్రసాద్‌కు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎస్సై శుక్రవారం జేసీబీ సాయంతో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. స్పీడ్ బ్రేకర్స్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే వినతులు పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.లావణ్యతో కలిసి ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 85 వినతులు అందాయి. వాటిలో ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక వినతిపత్రం అందజేశారు. మంగళాపురం గ్రామ సమీపంలోని రుంగండ గెడ్డ వద్ద సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాం పాడవ్వడం వలన వ్యవసాయ భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదని, మరమ్మతు పనులు చేయించాలని మండంగి నాగేశ్వరరావు తదితర రైతులు వినతిపత్రం అందజేశారు. సంధిగూడ గ్రామానికి అంగన్వాడీ భవనం, పాఠశాలను మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. కేదారిపురం కాలనీలో గల అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పూర్వీకుల నుంచి జీవనం సాగిస్తున్నామని, తమకు ఇళ్ల స్థలాలు, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కేదారిపురం, పి.లేవిడి గ్రామాలకు చెందిన పసుపురెడ్డి మహేష్, ఎం.శోభన్‌బాబు తదితరులు వినతిపత్రం అందజేశారు. వినతులు స్వీకరించిన కలెక్టర్ ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు, సూచనలు చేశారు.

కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రారావు, స్కూల్ ఎడ్యుకేషన్ సహాయ సంచాలకులు ఎంతఈ రాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి జి.మల్లికార్జున, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన అధికారి కె.వి.ఎన్.రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జె.రత్నాకర్, బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులతో కలిసి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

క్రీడా సామగ్రి పంపిణీ

పాలకొండ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ-2 కురిటి సోంబాబు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు, ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన క్రీడా సామగ్రిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. మండలంలోని 59 పాఠశాలలకు వాటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయమోపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో శుక్రవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహించాలని వ్యాయమోపాధ్యాయులకు సూచించారు.

సీతంపేట: సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) నుంచి వచ్చిన క్రీడా సామగ్రిని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎస్.జాకాబ్‌దయానంద్ శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులు వాటిని సక్రమంగా వినియోగించుకునేలా వ్యాయామోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు.


సీతంపేట: క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్

క్రీడాకారులకు బూట్లు వితరణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక హైస్కూల్ గ్రౌండులో శిక్షణ తీసుకుంటున్న పది మంది నిరుపేద క్రీడాకారులకు గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన గుడ్ల వెంకటరావు రన్నింగ్ షూస్‌ను అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు సాయంగా వాటిని అందజేసినట్లు చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ బంగారి రామకృష్ణ ఉన్నారు.


గుమ్మలక్ష్మీపురం: క్రీడాకారులకు షూ అందజేస్తున్న గుడ్ల వెంకటరావు


పాలకొండ రూరల్: ఎమ్మార్సీకి చేరిన క్రీడా కిట్లను వ్యాయామోపాధ్యాలకు అందిస్తున్న ఎంఈఓ

జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్
- ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతి విడుదల

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ ప్రతిని శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు ఉండగా అందులో నియోజకవర్గాల వారీగా ఇలా వివరాలు కలెక్టర్ విడుదల చేసి ముసాయిదా జాబితా ప్రకారం ఇలా ఉన్నాయి. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి టీవీ రమణ, సీపీఐ ప్రతినిధి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి కె.వెంకటనాయుడు, లోక్‌సత్తాపార్టీ ప్రతినిధి కె. పాపారావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. రవికుమార్, కలెక్టర్ కార్యాలయం పర్యవేక్షకులు రవికుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్	మొత్తం
పాలకొండ- ఎస్టీ	95500	100495	12	196007
కురుపాం-ఎస్టీ	92084	97288	39	189411
పార్వతీపురం-ఎస్సీ	91987	94858	11	186856
సాలూరు-ఎస్టీ	96649	101599	3	198251
మొత్తం	3,76,220	394240	65	770525

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ జీవీ కృష్ణారావు

పాలకొండ రూరల్: విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక విజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసుల విధులు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న కష్టాలు, అమరవీరుల త్యాగాలు, వారి స్ఫూర్తి గాథలను వివరించారు. విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యాలపైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో చిన్నమేరంగి సీఐ సీహెచ్.ప్రసాద్, ఎస్సైలు కళాధర్, అనీష్, బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

సీతంపేట: దేశ రక్షణ, ప్రజారక్షణలో సమిధులైన అమరవీరుల త్యాగాలు మరువలేనివని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక బాలుర గిరిజన గురుకుల కళాశాలలో శుక్రవారం పోలీసుల విధులు, సమాజంలో వారి పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ మురళీధర్, ఎంపీడీఓ కె.గీతాంజలి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పి.నాగభూషణరావు, ఎస్సై ఎ.నీలకంఠరావు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ జీవీ కృష్ణారావు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు


తోటపల్లి ప్రాజెక్టులో చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా మంజూరు చేసిన 9 లక్షల చేప పిల్లలను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి శుక్రవారం తోటపల్లి ప్రాజెక్టులో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. చేపపిల్లల పెంపకంపై మత్స్యకారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మత్స్యశాఖాధికారి తిరుపతయ్య, శ్రీదేవి, మత్స్యకార సంఘ అధ్యక్షుడు డి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ వివరాలు సరిచూసుకోండి

కొమరాడ: ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకున్న రైతులు వాటిలో ఏమైనా తప్పులు ఉంటే ఈ నెల 29లోగా సరిచేసుకోవాలని వ్యవసాయాధికారి పి.శంకరరావు సూచించారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురం ఆర్‌బీకే వద్ద శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ-క్రాప్ నమోదు వివరాలు ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. నవంబర్ 1న తుది జాబితాలు ప్రచురించనున్నట్లు చెప్పారు.

గరుగుబిల్లి: రైతులు ఈ-క్రాప్ జాబితాలో పేర్లు, పంటసాగు, విస్తీర్ణం, తదితర వివరాలను సరిచూసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని ఏఓ ఆర్.విజయభారతి అన్నారు. మండలంలోని నాగూరు, తోటపల్లి, రావివలస, సంతోషపురం గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద శుక్రవారం ఈ-క్రాప్ జాబితాలను ప్రదర్శించారు.

భామిని: రైతుభరోసా కేంద్రాలలో ప్రదర్శించిన ఈ-క్రాప్ జాబితాలను రైతులు పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే ఆర్‌బీకే సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలని భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు సూచించారు. మండలంలోని లివిరి ఆర్‌బీకేలో శుక్రవారం ఈ-క్రాప్ నమోదు జాబితాలను వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్ ప్రచురించారు. లివిరి, అనంతగిరి, బైరికాలనీ రైతుల పేర్లు, పంట వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బౌరి త్రినాథరావు, పాల్గొన్నారు.